నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చందానగర్ : చందానగర్, వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- శ్రీధర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 గంటల వరకు శ్రీరాంనగర్, అపర్ణ ఎన్‌క్లేవ్, కిన్నెర హోటల్ గంగారం ప్రాంతాలలో విద్యుత్ ఉండన్నారు.
- ఫ్రెండ్స్ కాలనీ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంటల వరకు శిల్పా ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ ఏరియాలలో..
- శంకర్‌నగర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంట నుంచి 2.00 గంటల వరకు గౌతమీనగర్, వార్డు ఆఫీస్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అమీనాబేగంకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిని అమీనా బేగంకు శుక్రవారం పీహెచ్‌డీ ప్రకటించారు. 'మనూ' చరిత్ర విభాగంలో ప్రొ. డానిష్ మోయిన్, సీఎస్ఎస్ఈఐపి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ తాహ పర్యవేక్షణలో అమీనా పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె 'నోబిలిటీ అండర్ ది నిజామ్స్ ఆఫ్ హైదరాబాద్: ఏ స్టడీ ఆఫ్ ఉమ్రా-ఈ-పైగా(1724-1948 ఏడీ)' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ. 2 వేలు, మరో 14 మందికి రూ. 1500 జరిమానా, అదేవిధంగా మరోకరికి రూ. వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

చందానగర్ : పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, భారతీనగర్ డివిజన్ల పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన రూ.11,01,276లు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, నరేష్ నాయక్, సంతోష్, శివ, వెంకటేష్, భీమ్ రాజ్, అవినాష్, చందు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్లు గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ కల్పన శనివారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీ జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా జేఎన్‌వీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డిని సన్మానించిన నిర్వాహకులు

చందానగర్: నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని తెలంగాణ ఐసీసీ ఎస్పీ పుష్పారెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ ప్రారంభించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులకు రన్నింగ్ రిలే పోటీలు, క్రికెట్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలను మొదటి రోజు ప్రారంభించారు. నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన ఉపసంచాలకులు టి గోపాలకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి 3వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారు.



బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో.. వేంకటేశ్వర స్వామి



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో.. సామూహిక పారాయణం



గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో..



ఘనంగా ముక్కోటి ఏకాదశి

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

- తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం

శేరిలింగంపల్లి జోన్ బృందం: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. పూజలు, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముక్కోటి రోజు ఉత్తర ద్వార దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. పలు ఆలయాల్లో స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.
- గోపన్‌పల్లి, నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయం, చందానగర్, భెల్ ఎంఐజీ, రాయదుర్గం, వినాయక్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం, తారానగర్, మాదాపూర్, జీపీఆర్ఏ క్వార్టర్స్ ఆలయం, గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రం, టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయం, ఇందిరానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, హఫీజ్‌పేట్, దీప్తిశ్రీనగర్, మధురానగర్, ఖాజాగూడ సాయిఐశ్వర్యకాలనీ, గౌలిదొడ్డి, ఎన్టీఆర్‌కాలనీ, గోపన్‌పల్లితండా, కొత్తగూడ, కొండాపూర్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో..

సమగ్ర అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్ డివిజన్ పరిధిలో రూ.4 కోట్లతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర, సంతులిత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్ డివిజన్ పరిధిలో సుమారు రూ.4.04 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్, ఆదిత్యనగర్, సాయినగర్, కాకతీయ హిల్స్, నవభారత్ నగర్, యశోద హాస్పిటల్, మాతృశ్రీనగర్ కాలనీలలో సీసీ రోడ్లు వేస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీలవాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోకుల్‌ప్లాట్స్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

పిల్లలకు విలువలు, సంస్కృతిని నేర్పాలి

- ఎంపీ ఈటల రాజేందర్
- శిల్పకళా వేదికలో అభ్యాస పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

మాదాపూర్: విద్యార్థులు మార్కులు తెచ్చే యంత్రాలు కాదని వారికి మానవీయ విలువలు నేర్పాలని పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శుక్రవారం అభ్యాస పబ్లిక్ స్కూల్ 28వ వార్షికోత్సవంలో మెగా థియేటర్ ప్లే సంవిధాన్ -75ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మన సంస్కృతి, ఆచార వ్యవహారాలను నేర్పించాలని సూచించారు. సామాజిక బాధ్యతను తెలియజేయాలన్నారు. స్కూల్ ఫౌండర్ వినాయక మాట్లాడుతూ విద్య అనేది జీవిత కాలం అభ్యాసమని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కరుణాగోపాల్ పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థికాభివృద్ధిలో సహకారం అవసరం

'మనూ' ఛాన్స్‌లర్ ముంతాజ్ అలీ

రాయదుర్గం: సామాజిక, ఆర్థికాభివృద్ధిలో సహకారం ఎంతో ముఖ్యమని మనూ ఛాన్స్‌లర్ ముంతాజ్ అలీ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీలో అంజుమన్-ఏ-ఖవాతీన్ (ఎంఏకే) ఎస్ఏఎఫ్ఏ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ధనక్ బజార్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు చెందిన మహిళల్లో వ్యవస్థాపకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు వేదికగా మారతాయన్నారు.వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ వ్యవస్థాపకత, ఆవిష్కరణల భవిష్యత్తును రూపొందించడంలో అకాడెమియా పాత్ర ఉంటుందన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

గచ్చిబౌలి: రెడిమిక్స్ లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు, గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్కండ్ రాష్ట్రం రామ్‌ఘర్ పరిధిలోని మురుబండ స్వార్థి బోరోబింగ్‌కు చెందిన కులదీప్‌కుమార్ (34) నగరానికి వలస వచ్చి రెడిమిక్స్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి లారీ వట్టినాగులపల్లి నుంచి గోపన్‌పల్లికి అతి వేగంగా వస్తూ మార్గమధ్యంలో ఎన్టీఆర్‌నగర్‌లోని ప్రణీత్ విల్లాస్ వద్ద మూలమలుపులో బోల్తా పడింది. డ్రైవర్ కులదీప్‌కుమార్ తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



రాయదుర్గం: పాఠశాలల్లో సంక్రాంతి సందడి నెలకొంది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో శుక్రవారం గాలిపటాలు, హరిదాసు, గంగిరెద్దులు, రైతులు, వివిధ రకాల వేషధారణల్లో సందడి చేశారు. ప్రధానోపాధ్యాయుడు మురళి, డాక్టర్ లంక పార్థసారథి ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాంజలి స్కూల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలోని విద్యాంజలి హైస్కూల్‌లో.. వేడుకల్లో భాగంగా ప్రిన్సిపాల్ బాలత్రిపుర సుందరి బొమ్మల కొలువును ప్రారంభించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. బాలికలకు రంగోళీ పోటీలు నిర్వహించారు. బాలురు గాలి పటాలు ఎగురవేశారు. అనంతరం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో..

భారత్ వికాస్ పరిషత్ నమో గంగా ఆధ్వర్యంలో విద్యాంజలి స్కూల్‌లో యువ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రైమరీ విద్యార్థులు స్వామి వివేకానంద వేషధారణ చేశారు. హైస్కూల్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు భారత్ వికాస్ పరిషత్ మహిళా ప్రముఖ్ అంబికా సురేంద్ర బహుమతులను అందజేశారు.

సంస్కృతి డిగ్రీ కళాశాలలో..

రాయదుర్గం: కొండాపూర్‌లోని సంస్కృతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వేడుకలో భాగంగా విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రేవతిరాజు, యామినిరాజు, ప్రిన్సిపల్ సురేందర్ అధ్యాపకులు పాల్గొన్నారు.



టాస్కులు, కమీషన్‌ల పేరిట మోసం

- రూ.14, 45,000 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్‌ల పేరుతో ఫోన్ టెలిగ్రామ్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.14 లక్షల 45 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 26వ తేదీ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి నగదు చెల్లించి టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.14 లక్షల 45 వేలు చెల్లించాడు. చివరగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, గురువారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తక పఠనం అవసరం

హెచ్‌సీయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్

రాయదుర్గం: విద్యార్థులకు పుస్తక పఠనం అవసరమని హెచ్‌సీయూ జాయింట్ రిజిస్ట్రార్ బి శ్రీనివాస్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌కు ఆయన రూ.10వేల రూపాయలను విరాళంగా అందించారు. అంతేకాకుండా కెనరా బ్యాంకు నుంచి దాదాపుగా లక్ష రూపాయలు ఖరీదు చేసే పుస్తకాలను బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్ శుక్రవారం ప్రిన్సిపల్ మురళికి అందించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకాలు ఇష్టపడి చదవాలని సూచించారు.



శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్పబజార్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. శిల్పబజార్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బెంగుళూరికి చెందిన నృత్య నూపుర స్కూల్ ఆఫ్ డ్యాన్స్ గురువు మైథిలి దీపాల శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గణపతితాళం, శివ తాండవం, మధురాష్టకం, అయిగిరినందిని, భజమానస, కావడి చిందు, ముద్దుగారే యశోద తదితర అంశాలను ప్రదర్శించారు. -మాదాపూర్

ముగ్గుల పోటీలు



చందానగర్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని చందానగర్‌లోని లైట్ హౌస్‌లో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైట్ హౌజ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికివస్తుందన్నారు. నేటి యువతరం మన సంస్కృతి తెలుసుకుంటారన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

తారానగర్‌లో..

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తారానగర్ విద్యానికేతన్‌లో రంగోళీ పోటీలను నిర్వహించారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలోని 35 కాలనీల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రామాచారీ, ప్రిన్సిపాల్ కనకదుర్గ పాల్గొన్నారు.

తెరపైకి మరో కార్పొరేషన్!

తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను కలిపి ఏర్పాటు చేయండి
- ప్రభుత్వానికి ఎమ్మెల్యే గూడెం ప్రతిపాదనలు
- గ్రేటర్‌లో విలీనమైతే నష్టపోతామని అభిప్రాయం



తెల్లాపూర్ గ్రామం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను కలిపి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు మున్సిపాలిటీలు గ్రేటర్‌లో విలీనం అవుతాయని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదన సంచలనంగా మారింది. గ్రేటర్‌లో విలీనం అయితే.. చాలా నష్టపోతామని ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు.

జీహెచ్‌ఎంసీతో పోలిస్తే ఇక్కడే జోరుగా అభివృద్ధి

తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను ఆనుకుని ఉన్న గ్రేటర్ డివిజన్‌ల కన్నా ఈ రెండు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీకు పన్నులరూపంతో వస్తున్న ఆదాయంతో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఈ రెండు ప్రాంతాలు రోజురోజుకు మహానగరాలుగా విస్తరిస్తున్నాయి. ఇక ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా అధికారుల దృష్టికి తీసుకోనిపోయి సమస్యను పరిష్కరించుకుంటున్నారు. అదే గ్రేటర్‌లో విలీనం చేస్తే సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సివస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి రామచంద్రాపురం, భారతినగర్, పటాన్‌చెరు డివిజన్లను ఉదాహరణగా ప్రజలు చూపుతున్నారు.

లక్షలలో జనాభా...

తెల్లాపూర్ మున్సిపాలిటీలో గత కొన్ని నెలల క్రితం పటాన్‌చెరు మండలంకు చెందిన ముత్తంగి, పాటి, ఘనాపూర్, పోచారం, కార్తనూర్ విలీనమైన సంగతి అందరికీ తెలిసిందే. మున్సిపల్ పరిధిలో 3 లక్షల జనాభా ఉంది. అమీన్‌పూర్ మున్సిపల్‌లో తాజాగా కిష్టారెడ్డిపేట్, పటేల్ గూడ, సుల్తాన్‌పూర్, దయారా, ఐలాపూర్, ఐలాపూర్ తండాలో సుమారు అంతే జనాభా ఉంది.

తాజాగా కార్పొరేషన్ ప్రతిపాదనలు

తెల్లాపూర్, అమీన్‌పూర్‌లను మున్సిపల్ కార్పొషన్ చేయాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గత కొద్దిరోజుల క్రితం ప్రభుత్వ ముందు ప్రతిపాదనలు పెట్టారు. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వ దృష్టిలో ఉన్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్ చేయడం వలన నేతలు మేయర్, కార్పొరేటర్‌లు అయ్యే అవకాశాలుంటాయి.

కార్పొరేషన్‌తో మరింత అభివృద్ధి

హైదరాబాద్ శివారు మున్సిపాలిటీలైన అమీన్‌పూర్, తెల్లాపూర్‌లను మున్సిపల్ కార్పొరేషన్ అయితే ఈ ప్రాంత మరింత అభివృద్ధి చెందే అవకాశముంటుదని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు వచ్చే అవకాశం ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రత్యేక స్కీమ్‌లు వస్తాయని నేతలు చెబుతున్నారు.

కార్పొరేషనే బెటర్



తెల్లాపూర్ మున్సిపల్‌ను గ్రేటర్‌లో విలీనం చేయడం కన్న మున్సిపల్ కార్పొరేషన్ చేయడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటారు.
-ఈశ్వర్‌గారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రతిపాదన చేశాం



ఈ రెండు మున్సిపాలిటీలలో మరింత అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో మున్సిపల్ కార్పొరేషన్ చేయాలని ప్రతిపాదనలు పెట్టాం. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని భావిస్తున్నాను.
- గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే